# ఆలస్యం ... అమృతం ... అమృతమే !

**– గరికపాటి చంద్రశేఖర్**

చేతిలో చిన్న క్యాష్ బ్యాగ్, బ్రీఫ్ కేస్‌లతో బయటకు వచ్చాను. ప్రొద్దుట్నుంచీ మా ఆవిడ ఒకటే నస.

"ప్రొద్దెక్కింది లేవండి. త్వరగా తయారవండి. రోజూ లాగ ఈవేళ కూడా హడావిడి పడితే కంగారయిపోతుంది. ఆ కంగారులో తమరి ఒళ్ళు తమ స్వాధీనంలో వుండదూ" అంటూ ఊ .... హోరెత్తిస్తోంటే చిరాకుపడుతూనే లేచాను ఎనిమిదయ్యాక.

ఈ ఆడాళ్ళందరూ ఇంతే. అక్కడికి, మొగుళ్ళు పాపం తమని తాము ఉద్ధరించుకోలేనట్లు, మగాడి ప్రపంచం అంతా తమ గుప్పిళ్ళలోనే వున్నట్లు తెగ ఫీలయిపోతూ వుంటారు. నేనేం తక్కువ తిన్నానా ! ఆవిడ నస ఆవిడతోనే వుండనిచ్చి, నా బద్ధకం, ఆ తర్వాత హడావిడి అంతా యధావిధిగా కానిచ్చేస్తాను. లేకపోతే నాకేం తెలివి లేదా ! అమాయక చక్రవర్తినా ! ఆవిడగారు చెప్పిందే వేదమన్నట్లు గీటు దాటకుండా వుంటానా !

మామూలు కార్యక్రమాలన్నీ, అంటే తీరిగ్గా పేపర్ తిరగేసి, అంతకన్నా తీరిగ్గా జలకాలాడి బయటికొచ్చేసరికి పది. హమ్మ బాబోయ్ – ఈ ఆఫీసర్ యములాడి చేత ఎన్ని అక్షింతలో అనుకుంటూ నాలుగు ముద్దలు మింగి, హడావుడిగా అన్నీ సర్దుకుని బయల్దేరేసరికి మరో పావుగంట.

బస్టాపు కొచ్చేసరికి పదిన్నర. ఆఫీసులో వుండాల్సిన టైం. ఇప్పటికే రోజూ ఆలశ్యంగా వస్తున్నానని మా యములాడు నా మీద కనబడినప్పుడల్లా కారాలు, మిరియాలు నూరేస్తున్నాడు. పైగా ఈ వేళ ఆఫీసులో ఇన్స్పెక్షన్.

ఈరోజు కూడా లేటయిందంటే, చివాట్లతో సరిపెట్టడు. మెమో ఇచ్చి మరీ సత్కరిస్తాడు. ఇప్పుడు గుర్తొస్తోంది మా ఆవిడ భవిష్యవాణి "కంగారు" అనే మాట. ప్చ్, నా మీద నాకు చచ్చేంత కోపంగా వుంది. పైగా అసలు విషయం. అదే, ఆ క్యాష్‌బ్యాగ్ కూడా చేతిలో వుంది.

అమ్మాయి పెళ్ళికి కాస్త సర్దవయ్యా బావా అంటే మారుమాట్లాడకుండా మా బావమరిది అక్షరాలా లక్ష రూపాయలు రాత్రే తెచ్చి నా చేతిలో పోశాడు. ఆ క్యాష్ మొత్తాన్ని క్యాష్‌బ్యాగ్‌లో పెట్టి దాన్నీ, నా ఆఫీస్ కాగితాలుండే బ్రీఫ్‌కేసునీ రెండు చేతుల్లోనూ పట్టుకున్నాను. ఇంత డబ్బు చేతిలో వుంచుకొని బస్సెక్కడం ఎందుకూ అనిపించింది. అదీగాక ఇంకా లేటైతే అవతల యములాడితో చిక్కు.

నా అకౌంట్, ఆఫీసు పక్కనే వున్న ఆంధ్రాబ్యాంక్‌లో వుంది. ఓసారి ఆఫీసులో దర్శనం ఇచ్చేస్తే, సంతకం పెట్టినట్లూ వుంటుంది, తొందరగా ఆఫీసుకి వచ్చినట్లు వాళ్ళకి అన్పిస్తుంది. ఔను. అదే గుడ్ ఐడియా. పైగా ఈరోజే ఇన్స్పెక్షన్ కూడా కాబట్టి, ఆ ఫైల్స్ కాస్త బైట పెట్టి తర్వాత డబ్బు డిపాజిట్ చేయటానికి వెళ్ళడం అనేది అన్నివిధాలా నా ఆఫీసు జీవితానికి శ్రేయస్కరం.

నా ఆలోచనలలో నేనుండగానే, ఆటో రెండు మూడు జెర్కులిచ్చి ఆగిపోయింది.

"క్యాహువా భాయ్" అడిగాను.

"ఏం లేదు. ఇంజన్ ట్రబుల్ సార్. చూస్తానుండండి" ఉర్దూలో చెప్పి, కూర్చునే సీటు ఎత్తి ఏదో చేస్తున్నాడు. ఇక్కడ నా బి.పీ. భయంకరంగా పెరిగిపోతుంటే, అతను మాత్రం తాపీగా రిపేరు చేస్తున్నాడు. పదినిముషాలయ్యాక విసుగు పెరిగిపోయి "వేరే ఆటో మాట్లాడుకుంటాను" అన్నాను. వద్దు సార్ అంటూ మరో అయిదు నిమిషాలాపాక, నేను వేరే ఆటోలో పోతాననే సరికి,

"పైసా దేకే జావ్" అన్నాడు.

నాకు తిక్కరేగింది. "ఎందుకివ్వాలి. పైసా ఇవ్వను. నీ మూలంగా అరగంట లేటు" దబాయించి, మళ్ళీ "కానీలే"

అనుకుని మీటరు డబ్బులు మాత్రం చేతిలో పెట్టి వేరే ఆటోలో ఆఫీసుకు చేరేసరికి పదకొండుంబావు.

అప్పుడే అటెండెన్స్ రిజిష్టర్ ఆఫీసర్ దగ్గరకు వెళ్తోంది. "హమ్మయ్య" అనుకుని ఆనందంగా సంతకం చేసేసి సీట్లో కూర్చున్నాను.

ఇంక బ్యాంకుకి వెళ్దాం అని చూసుకుంటే ఇంకేముంది. నా క్యాష్ బ్యాగ్ లేదు. లక్షరూపాయల సొమ్ము. ఆటోలో మర్చిపోయాను. ఏ ఆటో ! మొదటిదా ! రెండోదా! ఏమో అస్సలు గుర్తులేదు. ఆటో నంబరు కేసి చూడనైనా లేదు. మనిషినైనా గుర్తు పట్టగలనో లేదో ! గుండె దడ పెరిగిపోయింది. నిమిషాల్లో నలుగురూ పోగయ్యారు. విషయం తెలుసుకుని తమకు తోచినది ప్రవచించారు. నా క్లోజ్‌ఫ్రెండ్ రామారావు "ఓసారి పోతే సొమ్ము దొరకడం కష్టం బ్రదర్. పుస్తకం, వనితా, విత్తం .... " అంటూ ఏదో శ్లోకం చదవబోతుంటే "అసలే డబ్బు పోయి నేనేడుస్తూంటే నువ్వు ఉపదేశాలిస్తావేంట్రా" అంటూ వాడిని విసుక్కుని నాలో నేను మధనపడుతూంటే ఇన్స్పెక్షన్ పార్టీ రానే వచ్చింది. వాళ్లడిగే అవసరమైనవి, అనవసరమైనవి ఫైల్స్ పీకి ఇన్ఫర్మేషన్ అందిస్తూంటే సాయంత్రం అయిపోయింది. ఏ పని చేస్తున్నా గుండెల్లో దిగులుగా వుంది. వందా, వెయ్యా ! వంద వేలు. వెయ్యి వందలు. అక్షరాలా లక్ష రూపాయలు. ఇప్పుడే లెక్కపెట్టినట్లుగా అన్పిస్తోంది. ఎవడి పాలబడ్డాయో ! బిళ్ళ కుడుముల్లాగా స్వాహా చేసేసుంటాడు.

బస్సు దిగి కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరాను.

"ఒక్క నిమిషం. కాఫీ, టిఫిన్ తెస్తాను. ఏమిటి అదోలా వున్నారు ?" అంటూనే లోపలికి వెళ్ళింది.

అసలు విషయం తెలిస్తే, కాఫీ టిఫిన్ కాదు, నిప్పుల పళ్ళెం తెచ్చి నెత్తిమీద గుమ్మరిస్తుంది. వాళ్ళ అన్నగారిచ్చిన డబ్బులాయె.

అసలు విషయం ఎలా మొదలు పెట్టడం ? ఆలోచిస్తున్నాను.

వేడి వేడి పకోడీలు వచ్చాయి. ఒక్కొక్కటీ నోట్లో వేసుకుంటూంటే, కుంకుడు కాయల్లాగా తగుల్తున్నాయి.

ఇంతలో కాఫీ తీసుకొచ్చి పక్కనే కూర్చుంది.

"పొద్దునా .... డబ్బులూ" .... మొహం చూడకుండా, తింటున్నట్లు నటిస్తూ మొదలెట్టాను.

"ఆ ! ఔనండోయ్. మీ మతిమరుపు మండిపోనూ ! ఏం హడావిడి మనిషండీ బాబూ మీరు. అన్నయ్య ఇచ్చిన క్యాష్ బాగులోని డబ్బులు, మీ క్యాష్‌బ్యాగ్‌లో సర్దుకుని, వెళ్ళేటపుడు మాత్రం ఆ కాళీ క్యాష్‌బ్యాగ్ పట్టుకు చక్కా పోయారు. అందుకే అంటాను ప్రొద్దున్న లేచిన దగ్గర్నుండే తొరగా లేవండీ అని. వింటారా ! మీ దారి మీది. నా గోల నాది అంతే".

అంతే ! ఆనందంతో నాకు పొలమారింది. ఆవిడ గారి నస నాకు విసుగనిపించకపోగా గొప్ప సరదాగా అన్పించింది.

హెచ్చుతగ్గులున్న చోట
చచ్చిపోవు సమభావము
సమభావము లేనిచోట
సామ్యవాద ముత్తమాట.

-కాళోజి